నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I | హైదరాబాద్, గురువారం 23 జనవరి 2025 | RANGAREDDY

# రసాభాసగా కరీంపూర్ గ్రామ సభ

**ఇందిరమ్మ ఇండ్ల విషయంలో అధికారులను నిలదీసిన గ్రామస్తులు**

**కాంగ్రెసోళ్లకే ఇందిరమ్మ ఇండ్లా అంటూ ఆగ్రహం**

బంట్వారం (కోట్‌పల్లి), జనవరి 22 : మండల పరిధిలోని కరీంపూర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన గ్రామ సభ రసాభాసగా సాగింది. అధికారుల సమన్వయం లోపించినట్లుగా కనిపించింది. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో చాల మంది పేర్లు జాబితాలో రాకపోవడంతో గందరగోళం నెలకొన్నది. ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇండ్ల కోసం 217 మంది దరఖాస్తులు చేసుకోగా, కేవలం 110 మంది మాత్రమే అర్హులంటూ జాబితాను ప్రకటించారు. దీంతో మిగిలిన 107 మంది తామెట్ల అర్హులం కాదో తెలుపాలని పట్టు బట్టారు. అర్హుల జాబితాలో పేర్లు రాకుంటే, అనర్హుల జాబితాను సైతం పెట్టాలని, వీటికి కారణాలు సైతం తెలియజేయాలని నిలదీశారు. అధికారులు సరైన సమాధానం చెప్పలేక విషయాన్ని దాటవేసే ప్రయత్నం చేశారు. ఏకంగా వందకుపైగా దరఖాస్తుదారుల వివరాలు ఏమయ్యాయని గ్రామస్తులు భగ్గుమన్నారు. చేసేదేమీ లేక మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించడంతో ఒక్కసారిగా ముందుగా ఎందుకు నిర్లక్ష్యం జరిగిందని ఆగ్రహించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### రేకుల షెడ్‌లో ఉంటునా.. లిస్టులో పేరు రాలే..



నాకు ఇద్దరు పిల్లలు.. పెండ్లి ఈడుకు వచ్చారు. ఇల్లు కావాలని దరఖాస్తు చేసుకున్న. ప్రస్తుతం రేకుల షెడ్‌లో ఉంటున్నాం. ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదు. ఇదేనా ఇందిరమ్మ పాలన.. అంటే.. మాలాంటోళ్లకు ఇల్లు ఇవ్వకుండా తొత్తులుగా ఉండేటోళ్లకే ఇస్తారా..

**– కావలి మొగులయ్య, కరీంపూర్ గ్రామం, మండలం**

### 217 మంది ఇండ్లను సర్వే చేసి, ఫొటో క్యాప్చర్ చేశా..

ప్రజా పాలన దరఖాస్తుల ఆధారంగా ఇంటింటికీ వెళ్లి ఫొటోలు తీశాం. అయినా పూర్తిస్థాయిలో జాబితా రాలేదు. ఇంటి స్థలం ఉన్న లబ్ధిదారులు 68 మంది, ఇంటి స్థలం లేని అర్హులు 42 మంది పేర్లు మాత్రమే జాబితాలో వచ్చాయి. ఇంకా 107 మంది పేర్లు జాబితాలో ఎందుకు రాలేదో అర్థంకావడం లేదు.

**– జయరాజ్, కార్యదర్శి**

### కాంగ్రెసోళ్లు కుట్రలు చేస్తుండ్రు..



నా కుటుంబంలో ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదు. నాకు ఇద్దరు పిల్లలు వారెవరికీ రాలేదు. ఒక కొడుకు వినోద్‌కుమార్ పెండ్లి అయింది. వారికి ఇద్దరు పిల్లలు. ఇంకో కొడుకు విశ్వనాథం నాతోనే ఉంటున్నాడు. ఇల్లు లేక చిన్న పాడు బడ్డ ఇంట్లో ఉంటున్నాం. ఇలా ఉన్నప్పటికీ దరఖాస్తు చేసుకున్న, సర్వేలో సైతం అధికారులు ఫొటోలు తీసుకున్నా జాబితాల్లో పేర్లు రాలేదు. కాంగ్రెసోళ్లే కుట్రలు చేశారని అనిపిస్తున్నది.

**– కావలి బిచ్చన్న, కరీంపూర్ గ్రామం, మండలం**

### ఇదేం పాలన.. ఇల్లు ఉన్నోళ్లకే ఇస్తరా..



మా అమ్మ, మేము ఇద్దరం అన్నదమ్ములం ఒకే ఇంట్లో ఉంటున్నాం. గత ప్రజా పాలనలో ఇల్లు కావాలని దరఖాస్తు చేసుకున్న. దరఖాస్తు చేసుకున్నాక ఇంటికి వచ్చి సర్వే చేసుకున్నారు. ఇంటి స్థలం ఉన్నది ఇల్లు ఇవ్వాలన్న. అయినా ఇప్పుడు ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో నా పేరు లేదు. ఇదేం పాలన....ఉన్నోళ్లకే ఇండ్లు ఇస్తారా.. ఇప్పుడు వచ్చిన వాటిలో పేరు ఎందుకు లేదని అడిగితే తర్వాత వస్తది అంటున్నారు. ఇలా ఎన్ని సార్లు దరఖాస్తు చేసుకోవాలె.

**– కావలి లక్ష్మయ్య, కరీంపూర్**



బంట్వారం మండలంలోని కరీంపూర్ గ్రామ సభలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

- అర్హులైన మాకెందుకు ఇవ్వరంటూ నిలదీత
- ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగలేదంటూ అధికారులను ప్రశ్నించిన ప్రజలు
- ఇండ్లు ఉన్నవారినే ఎంపిక చేశారంటూ కోట్‌పల్లి మండలంలోని కరీంపూర్ గ్రామస్తుల ఆగ్రహం
- నియోజకవర్గానికి 3500 ఇండ్లు మంజూరు
- జిల్లావ్యాప్తంగా 1.70 లక్షల మందిని అర్హులుగా తేల్చిన జిల్లా యంత్రాంగం
- ఇందిరమ్మ ఇండ్ల కోసం కొత్తగా 3500 దరఖాస్తులు

### కేవలం కాంగ్రెస్ పార్టీ వాళ్లకే ఇండ్లు వచ్చాయి



ఆర్థికంగా బాగా ఉండి.. కాంగ్రెస్ పార్టీలో తిరిగే వాళ్లకే ఇండ్లు వచ్చాయి. ఏ ఒక్క పేదవాడి పేరు లిస్టులో రాలేదు. ఇంతకన్నా దారుణం లేదు. గ్రామంలో కాంగ్రెస్ నాయకులు కుట్రలు చేస్తుండ్రు. జిల్లా, రాష్ట్ర లీడర్లు పేదలకు ఇండ్లు ఇవ్వొద్దు.. కార్యకర్తలకే ఇవ్వమని చెప్పినట్టున్నరు. ఇదేనా ప్రజాపాలన, కాంగ్రెస్ పార్టీ గొప్పలు చెప్పుకోవడం తప్ప.. పేదవాళ్లకు ఎలాంటి ప్రయోజనం లేదు.

**– మాలావత్ అంబ్యానాయక్, మారేపల్లి తండా (పెద్దేముల్ మండలం)**

# కాంగ్రెసోళ్లకే.. ఇందిరమ్మ ఇండ్లు..!

### ఒకే కుటుంబంలో ఇద్దరికి ఇండ్లు వచ్చాయి..



ఒకే కుటుంబంలో ఇద్దరికీ ఇండ్లు వచ్చాయి కానీ ఇల్లు లేనివారికి మాత్రం ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలే. ఇదెక్కడి న్యాయమని ప్రశ్నిస్తే గొంతు నొక్కే ప్రయత్నం చేస్తుండ్రు. కాంగ్రెస్ పార్టీలో తిరిగితేనే ఇల్లు ఇస్తరా.. ఇంతటి కుట్రలు, కుతంత్రాలు మంచివి కావు. రాబోవు రోజుల్లో గోస పడుతరు. ఓట్ల కోసం వస్తే ఉరికిచ్చి కొడుతం. ఏ ముఖం పెట్టుకుని మళ్ల వస్తరు. అర్హులకు పథకాలు అందకుండా అనర్హులకు ఇస్తే పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏం న్యాయం చేసినట్లు. పేదల ఓట్లు కావాలెగాని వాళ్ల అవసరాలను మాత్రం గుర్తించరా.. ఇల్లులేని వారు ఎందరో ఉన్నారు.. ఇల్లు ఉన్నవారికే ఎందుకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినట్లు. ఇప్పటికైనా పేదలను పట్టించుకోవాలి.

**– భోజ్యానాయక్ , మారేపల్లి తండా (పెద్దేముల్ మండలం )**

వికారాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం మంగళవారం నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభలు, వార్డు సభల్లో రెండో రోజు కూడా నిరసనలు, నిలదీతలు కొనసాగాయి. ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలకు సంబంధించి ఈనెల 24 వరకు గ్రామ, వార్డు సభలు నిర్వహించి లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసి, ఈ నెల 26న సంబంధిత నాలుగు పథకాలను ప్రారంభించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అర్హులైనప్పటికీ లేనిపోని కొర్రీలు పెట్టి దాదాపు లక్ష మంది రైతులకు రుణమాఫీని దూరం చేసిన రేవంత్ ప్రభుత్వం ఈ నాలుగు పథకాలకు సంబంధించి కూడా నామమాత్రంగా కొంత మందికే ఇచ్చి ఎగనామం పెడుదామని చూస్తున్నది. ఆయా పథకాల లబ్ధిదారుల ఇంటింటి సర్వేలోనే కొత్త రేషన్ కార్డుల విషయంలో అర్హులై ఉండి దరఖాస్తు చేసుకుంటే తమ దరఖాస్తులను మాయం చేశారంటూ ప్రజలు నిలదీశారు. దీంతో అప్రమత్తమైన ప్రభుత్వం గ్రామసభల్లో ఎలాంటి నిరసనలు, నిలదీతలు కాకుండా కొత్త రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అంటూ చెప్పుకొచ్చారు. ప్రజాపాలన సమయంలో పడిగాపులు గాచి జిరాక్స్ కేంద్రాల చుట్టూ గంటల తరబడి క్యూలో నిల్చొని కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటే ఇప్పుడు లేకపోవడం ఏమిటని అధికారులను ప్రశ్నిస్తున్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు నిరంతర ప్రక్రియ అంటూ ప్రభుత్వం దాటవేస్తున్నదని ప్రచారం జరుగుతున్నది. ఇప్పటికే రుణమాఫీ విషయంలో ఏఈవో మొదలుకొని జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో అర్హులైనప్పటికీ రుణమాఫీకాని రైతుల దరఖాస్తులను స్వీకరించి ప్రభుత్వానికి అందజేసినప్పటికీ ఇప్పటి వరకు పట్టించుకోకుండా ఒక్క దరఖాస్తును కూడా పరిష్కరించని కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పటికే వారు అనుకున్న లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసి, గ్రామ సభల్లో దరఖాస్తులు తీసుకోవడం కేవలం ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను తగ్గించేందుకు మాత్రమేనన్న ప్రచారం జోరందుకున్నది.

### అనర్హులకే జాబితాలో చోటు..

కాంగ్రెస్ పార్టీకి చెందిన వారికి మాత్రమే ఇందిరమ్మ ఇండ్ల పథకానికి లబ్ధిదారులుగా ఎంపిక చేస్తారా అంటూ ప్రజలు ప్రభుత్వాన్ని, అధికారులను నిలదీస్తున్నారు. ఇందిరమ్మ పథకానికి లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి ప్రభుత్వం నియమించిన కమిటీల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే ఉండడంతో వారికి అనుకూలంగా ఉన్నవారిన మాత్రమే లబ్ధిదారులుగా ఎంపిక చేశారనే ఆరోపణలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ సంక్షేమ పథకాన్ని ప్రవేశపెట్టినా పార్టీలకు అతీతంగా అర్హులైన వారందరికీ ఆయా పథకాల ఫలాలను అందజేశారు. కానీ మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తున్నది. పార్టీల వారీగా వేరు చేస్తూ కేవలం కాంగ్రెస్ పార్టీకి చెందిన వారిని మాత్రమే ఆయా పథకాల ఫలాలను అందించేలా వ్యవహరిస్తున్నది. కమిటీల ఏర్పాటు మొదలుకొని లబ్ధిదారుల ఎంపిక వరకు అంతా కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్నవారికి ప్రయోజనం చేకూర్చేలా ముందుకెళ్తుండడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇండ్లు ఉన్నవారికే ఇండ్లు ఇస్తారా అంటూ అధికారులను నిలదీస్తున్నారు. బుధవారం కోట్‌పల్లి మండలంలోని కరీంపూర్ గ్రామంలో ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక సరిగ్గా జరగలేదని అధికారులను నిలదీశారు. నియోజకవర్గానికి 3500 ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేయగా, ప్రజాపాలనతో పాటు గతంలో స్వీకరించిన వాటిలో 2.50 లక్షల దరఖాస్తులుండగా, వీటిలో 1.70 లక్షల దరఖాస్తుదారులను అర్హులుగా తేల్చారు. మంగళవారం ఒక్కరోజు జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల పథకానికి గాను 3500 దరఖాస్తులు రావడం గమనార్హం.



యాచారం మండలం ధర్మన్నగూడ గ్రామసభలో ఆందోళన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని గౌరెల్లిలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు



తాండూరు మున్సిపల్ పరిధిలోని 13వ వార్డు గ్రీన్‌సిటీలోని వార్డు సభలో కాంగ్రెస్ నేతలను నిలదీస్తున్న కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి




కడ్తాల్ మండల కేంద్రంలో జరిగిన గ్రామ సభలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా జాబితాలో తమ పేర్లు లేవని అధికారులను అడుగుతున్న వ్యవసాయ కూలీలు

# రణ సభలు

## పోలీసుల బందోబస్తు మధ్య గ్రామసభలు..

రంగారెడ్డి, జనవరి 22 (నమస్తే తెలంగాణ) : రంగారెడ్డి జిల్లాలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల కోసం కొనసాగుతున్న గ్రామసభలు రెండోరోజూ నిరసనలు, నిలదీతల మధ్య సాగాయి. ప్రారంభంలోనే లబ్ధిదారుల ఎంపిక లిస్టులో తమపేర్లు లేవంటూ ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. మరోవైపు గ్రామసభల్లో తమ సమస్యల గురించి ప్రస్తావిస్తుండగా, ఎక్కడికక్కడ అడ్డుకుని పోలీసులు తమ గొంతు నొక్కుతున్నారని ప్రజలు వాపోతున్నారు. దీంతో జిల్లావ్యాప్తంగా బుధవారం జరిగిన గ్రామసభల్లో పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమయ్యాయి.

### కొనసాగుతున్న నిరసనల పరంపర..

యాచారం మండలంలోని ధర్మన్నగూడ గ్రామంలో గ్రామసభ ఆద్యంతం ఉద్రిక్తంగా సాగింది. సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం తయారు చేసిన లిస్టులో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని, అర్హులపేర్లు లేవని, అనర్హుల పేర్లు మాత్రమే జాబితాలో ఉన్నాయని గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందిస్తామని ఓవైపు ప్రభుత్వం చెబుతుండగా.. అధికారులు మాత్రం మరోవైపు అనర్హులను ఎంపిక చేస్తూ లిస్టు తయారు చేశారని, ఇది ఎంత మాత్రం సమంజసం కాదని వాపోతున్నారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించాలని, లేని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ఎంతోమంది నిరుపేదలుండగా, వారికి కాకుండా రేషన్‌కార్డులు, ఇండ్లు లిస్టుల జాబితాలో అనర్హుల పేర్లు ఉన్నాయని నిలదీశారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకోవడంతో వారిని అక్కడి నుంచి తోసివేశారు.

### ఆమనగల్లులో..

ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో నిర్వహించిన గ్రామసభ కూడా ఆద్యంతం గందరగోళంగా సాగింది. గ్రామసభలో లబ్ధిదారుల పేర్లు చదువుతుండగా.. తమపేర్లు రాలేదంటూ పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని ఆందోళనకారులను పంపించేశారు. ఆమనగల్లు మండలంలోని మంగల్‌పల్లిలో సైతం సమస్యలపై ప్రజలు తిరుగుబాటు చేయడంతో అధికారులు వెనుదిరిగారు.

### పోలీసుల నిర్బంధం మధ్య గ్రామసభలు..

రంగారెడ్డి జిల్లాలో రెండోరోజూ లబ్ధిదారుల ఎంపిక గ్రామసభలు పోలీసుల నిర్బంధం మధ్య కొనసాగాయి. సమస్యలపై ప్రశ్నించే వారిని అక్కడి నుంచి బలవంతంగా పంపించేశారు. గ్రామసభల్లో పోలీసుల జోక్యంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. జిల్లావ్యాప్తంగా జరిగిన గ్రామసభల్లో ఎక్కడ చూసినా పోలీసులు అత్యుత్సాహాన్ని ప్రదర్శించారు.

**రెండోరోజూ నిరసనలు, నిలదీతలు**

**లిస్టుల్లో పేర్లులేవంటూ ఆందోళనకు దిగిన జనం**

### పేదలకు ఇల్లు ఇవ్వరా..?



కూలీనాలి చేసుకునేదాన్ని. సొంతిల్లు లేదు. ఇందిరమ్మ ఇల్లు అంటే పేదలకు ఇవ్వరా..? ఇండ్లు ఉన్నోళ్లకే మళ్లీ ఇండ్లు ఇస్తుండ్రు. కాంగ్రెస్ సర్కారు వస్తే మా కష్టాలు తీరుతయనుకున్నం. కానీ బాధలు ఎక్కువవుతున్నయ్. ఇదెక్కడి న్యాయం. ఇల్లు మంజూరు చేయాలి.

**– జంతుక అలివేలు, ఆమనగల్లు మున్సిపాలిటీ 5వ వార్డు**

### సర్వేలో అర్హులెవరో తెల్వలేదా..?



ఇంటింటికీ తిరిగి సర్వే చేసిండ్రు. సర్వేలో అర్హులెవరో.. అనర్హులెవరో తెల్వలేదా.. పెంకుటిండ్లు, రేకుల షెడ్లు, గుడిసెలు ఉన్నోళ్లకు ఇందిరమ్మ ఇండ్లు రావు.. బిల్డింగ్‌లు ఉన్నోళ్లకే మళ్లీ ఇండ్లు ఇస్తరా.. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం. గ్రామ సభలో పేర్లు చదువుతుంటే గుండెలవిసిపోయినయ్. ఎలాంటి ఇల్లు లేకుండా స్థలం ఉన్నవారికీ ఇల్లు మంజూరు కాలేదు. న్యాయం జరిగే వరకు ధర్నా చేస్తాం.

**– వస్పుల యాదగిరి, ఆమనగల్లు మున్సిపాలిటీ 5వ వార్డు**

### ఇల్లు కూలిపోయేటట్టున్నది..



నాకు సెంటు భూమి కూడా లేదు. ఇల్లు కూడా కూలిపోయేటట్టున్నది. ఇందిరమ్మ ఇల్లు, అత్మీయ భరోసా పథకాల కోసం దరఖాస్తు చేసుకున్నా. ఏదీ రాలేదు. ఇదెక్కడి న్యాయమని అధికారులను అడిగినా పట్టించుకోలేదు. మళ్లీ దరఖాస్తు చేసుకోమంటున్నరు. కాంగ్రెసోళ్లే కుట్రలు చేసిండ్రని అనుమానం ఉన్నది. ఇది సరైన పద్ధతి కాదు.

**– గోరటి జగన్, ఆమనగల్లు మున్సిపాలిటీ 5 వార్డు**

### నాకు భర్త లేడు.. ఇల్లు వస్తదనుకున్నా..



నాకు భర్త లేడు. కూలినాలి చేసుకుని బతుకుతున్నా. ఇద్దరు కూతుర్లలో ఒకరికి పెండ్లి చేశా. ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకుని ఎంతో ఆశతో ఉన్నా. కానీ లిస్టులో పేరు రాలేదు. ధనవంతులకే ఇండ్లు వచ్చినయ్, రేషన్ కార్డులు వచ్చినయని చదివిండ్రు. పేదల పేర్లు మాత్రం చదువలేదు. ఇంతటి ఘోరమైన పాలన వస్తదనుకోలే. మాలాంటి దిక్కులేని పేదలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోదా.. ఇదెక్కడి న్యాయం. వితంతువులకు కాంగ్రెస్ సర్కార్ అండగా ఉంటదనుకుని ఓట్లు వేసినం. కానీ ఈ రకంగా మోసం చేస్తదని అనుకోలే. వాళ్లకు మా గోస ముడుతది.

**– అట్టికేశ్వరం జంగమ్మ, ఆమనగల్లు మున్సిపాలిటీ, 5వ వార్డు**



ఆమనగల్లు మున్సిపాలిటీ 5వ వార్డులో అధికారులను నిలదీస్తున్న జనం



చేవెళ్ల మండలంలోని సంకెపల్లి గ్రామ సభలో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు